

**టి. ఎస్. జగన్‌మోహన్**

(క్రిందటి సంచిక తరువాయి)

ఆరు నెలల తరవాత ఆ రోజు శేఖర్, అరుణలకు ఓ శుభవార్త అందింది. శేఖర్ బలవంతం మీద అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శనానికి అరుణ పంపిన 'మహాప్రస్థానం' చిత్రానికి ప్రథమ బహుమతి ఆ వార్త. "కంగ్రాచ్యులేషన్స్, అరుణా! హార్టీ కంగ్రాచ్యులేషన్స్!" అన్నాడు శేఖర్ ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బు అయిపోతూ. భర్తను కౌగిలించుకుంది అరుణ ఆనందంగా. సంతోషంతో వారిద్దరికీ నోట మాట రాలేదు. ఆ మర్నాడు సాయంత్రం అరుణ గౌరవార్థం 'కళాభవన్'లో అరుణ పెయింటింగ్స్ ఎగ్జిబిట్ చెయ్యబోతున్నారు భాగ్యనగరంలోని కళాపోషకులూ, కళారాధకులూ. అంతే కాకుండా ఆ రాత్రి 7—30 గంటలకు చిత్రకారులంతా పెద్ద ఎత్తున అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆ సాయంత్రం శేఖర్ ఆ ఆనందం అంతా తనొక్కడిదే నన్నట్లు హడావుడి చేసేస్తూ, "ఆ ఎరుపు రంగు ధర్మవరం చీర కట్టుకో, అరూ! తెల్లని నీ ఒంటికి అదే ఎంతో బాగుంటుంది. రౌండు కుంకుమ బొట్టు కాస్త పెద్దదిగా పెట్టుకో. ఆ ముత్యాల జాలరుల నెక్లెస్ వేసుకో" అంటూ. ఇలా 6—45 దాకా ఏవో ఇన్‌స్ట్రక్షన్స్ ఇస్తూనే ఉన్నాడు. శేఖర్ అటూ ఇటూ హుషారుగా తిరుగుతూ ఆమె అలంకరణలో ఏవో సజెస్ట్ చేస్తూ ఉంటే, సింపుల్‌గా వెళదామనుకున్నా, ఎదురు చెపితే భర్త మనస్సెక్కడ బాధ పడుతుందోనని అతని అభిరుచికి తగ్గట్లే అలంకరించుకుంది అరుణ. పెద్ద పెద్ద కళ్ళతో పాలరాతి విగ్రహంలా, ఎర్రని పట్టుచీరతో భూమి మీదికి దిగి వచ్చిన దేవతలా ఉన్న భార్య కేసి ఆప్యాయంగా చూసి సున్నితంగా ఆమె ఫాలభాగాన్ని చుంబించాడు శేఖర్. భార్య భుజం చుట్టూ చెయ్యి వేసి కారు కేసి నడిపించాడు. ఇద్దరూ కారులో కూర్చున్నారు. అరుణ డ్రైవ్ చేస్తోంది. కిటికీలోంచి చూస్తున్న చంద్రశేఖర్‌కి విసుగేసి రేడియో స్విచ్ ఆన్ చేశాడు. 7 గంటలయింది. వార్తలు అవుతున్నాయి. అనాలోచితంగా వార్తలు వింటున్న శేఖర్ హఠాత్తుగా సరిగా కూర్చున్నాడు. వార్తలు వింటున్న శేఖర్ మొహం కత్తివాటుకి నెత్తురు చుక్క లేనట్లు పాలిపోసాగింది. "హిందీ, తెలుగు, తమిళ భాషలలో ప్రసిద్ధ నేపథ్యగాయని శ్రీమతి లలితా బెనర్జీ ఇంట్లో దొంగలు ప్రవేశించి ఆమె ఆభరణాలు అపహరిస్తుండగా ఆమె భర్త శ్రీ బెనర్జీ వారికి అడ్డురాగా, వారు నిర్దాక్షిణ్యంగా అతన్ని కాల్చేశారు. భర్త చావును కళ్ళారా చూసిన లలితా బెనర్జీకి ఈ షాక్‌తో నోట మాట పడిపోయింది. ఆమె కోమల కంఠాన్ని అభిమానించే ఆమె అభిమాన శ్రోతలు ఇక ఆమె కంఠాన్ని వినలేరని తెలుపుటకు..." టప్పున రేడియో కట్టేశాడు శేఖర్.

అతని ఒళ్ళంతా వణికిపోతూంది. అతని రక్తనాళాలు ఉబ్బాయి. కళ్ళు ఎర్రగా, మంకెనపువ్వుల్లా ఉన్నాయి. కానీ, శేఖర్‌లోని ఈ బాహ్యాంతరంగాలలో కలుగుతున్న మార్పులు అరుణ గమనించలేకపోయింది. కారణం—జనసమ్మర్దంతో నిండి ఉన్న అబిడ్స్ మీదుగా కారు పోనిస్తున్న అరుణ దృష్టి రోడ్డుమీదే కేంద్రీకరించబడి ఉంది. లారీల హారన్లు, ఆటోరిక్షాల శబ్దాలతో హోరెత్తిపోతున్న ఆమె చెవుల్లో ఈ వార్త పడలేదు. జరగబోయే సన్మానం మీదే ఉంది ఆమె దృష్టి. 'అంతర్జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి అంటే మాటలా?' ఆమె మనస్సు గర్వంతో ఉప్పొంగింది. 'ఈ గౌరవం తనకు లభించడానికి కారణం తన. . .' కారు కళాభవన్ వద్దకు చేరడంతో ఆమె ఆలోచనలకు కూడా బ్రేక్ పడింది.

"రండి, అరుణాదేవిగారూ! రండి" అంటూ ఆర్ట్ ఎగ్జిబిషన్ ఆర్గనైజర్ ఆహ్వానించాడు అరుణను. నాలుగు మెట్లు ఎక్కాక వెనక్కి తిరిగి శేఖర్‌ను చూసి, "అరె! శేఖర్‌గారూ! మీరూ వచ్చారే!" అన్నాడు, అలా రావడం ఏదో బూతుపని అయినట్లు. ముక్తసరిగా నవ్వి ఊరుకున్నాడు శేఖర్. "కంగ్రాచ్యులేషన్స్, అరుణగారూ!" "మొత్తానికి ఫస్ట్ ప్రైజ్ కొట్టేశారే, అరుణగారూ!" "భలేవారే! ఎవరికీ తెలియకుండా అజ్ఞాతవాసంలో ఉంటూనే ఒక్కసారి ఇంటర్నేషనల్ లెవెల్‌లో ఫస్ట్ ప్రైజ్ సంపాదించేశారే, అరుణాగారూ!"— ఇలా రకరకాలుగా ఆ కంగ్రాచ్యులేషన్స్‌ను ఎంతోమంది తెలియజేశారు అరుణకు. అరుణ చుట్టూ మూగిన వారిలో సగం మంది శేఖర్ ఉనికినే గుర్తించలేదు. వారిలో పావు శాతం గుర్తించినా, గుర్తించనట్లు ఊరుకున్నారు. ఇంకో ఇరవై అయిదు మందికి శేఖర్ అంటే తెలియలేదు. ఆ అభిమానులు ఓ గొర్రెలమంద. ఎవరు, ఎప్పుడు, ఏ రంగంలో ఉన్నత స్థానంలో ఉంటే వారి చుట్టూ కాకుల్లా గుమిగూడతారు. ఖర్మవశాత్తూ, ఆ స్థానం నుంచి పదవీచ్యుతులయ్యారా— వారి ముఖం కేసి మరి చూడరు. ఒక వేళ చూశారంటే చాలు— ఆ చూపు చూపులా కాకుండా బాకులతో గుచ్చుతున్నట్లు చూస్తారు. ఇంతలో ఓ లావుపాటావిడ అలాంటి చూపు చూడనే చూసింది. చూపుతో సరిపెట్టకుండా "మీ సెక్రటరీనా, అరుణాదేవీ?" అంటూ అడిగేసింది మహా క్యూరియాసిటీగా. ముళ్ళమీద నిలబడ్డట్లు నిలబడ్డ శేఖర్‌కు ఆ గున్న ఏనుగు ప్రశ్నతో ఒంటికి కారం పూసినట్లయింది. ఘాటుగా అతను ఏదో జవాబియ్యబోయేటంతలో అరుణ—

"ఆయన మా శ్రీవారు. ప్రముఖ ఆర్టిస్ట్" అని జవాబిచ్చింది. "ఓహో! ఐ యామ్ సారీ!" అంటూ గుంపులో కలిసిపోయింది ఆ లావుపాటావిడ. ఇంతలో "శ్రీ రే గారు వస్తున్నారు" అంటూ ఎవరో అరిచారు. గుర్తింపు లేకుండా, వెధవలా ఓ మూల నిలబడిపోయినట్లు ఫీలవుతున్న అతని చుట్టూ ఉన్న గుంపును ఛేదించుకుని, రే కంట పడకుండా పారిపోవాలనిపించింది. కానీ, అరుణచుట్టూ గుమిగూడిన ఆ జనాన్ని చూస్తే అది అసంభవం అని తేలిపోయింది. 'తన వెనక తోకలా నన్ను వెంటేసుకుని వచ్చింది. బాడీగార్డులా తనే ఈ మహారాణీ చుట్టూ తిరగాలేమో? నా మొగుడో వెధవాయి. నేను వాణ్ణి మించిన ఆర్టిస్టు నని అందరికీ తెలియాలని తనను తీసుకు వచ్చింది.' అరుణ మీదకు మళ్ళింది శేఖర్ అక్కసు. ఇంతలో గుంపులోంచి త్రోవ చేసుకుంటూ రాయ్‌గారు హడావిడిగా వచ్చి, "కంగ్రాచ్యులేషన్స్, అమ్మా! క్రిందటి సంవత్సరం శేఖర్‌గారు సెకండ్ ప్రైజ్ అందుకుంటే, ఈ సంవత్సరం ఆయనే ఫస్ట్ ప్రైజ్ అందుకుంటారని అనుకున్నాను. ఇట్ ఈజ్ వెరీ ఫెంటాస్టిక్! నువ్వుకూడా ఓ చక్కని చిత్రకారిణివని గాని, 'నువ్వు ఫస్ట్ ప్రైజ్ తెచ్చుకోగలవని గాని నేను కలలోకూడా ఊహించలేదు. ఎంతైనా మీ భార్యా భర్తలిద్దరూ భలే తోడు దొంగలు!" అంటూ అప్రయత్నంగా పక్కకు తిరిగిన ఆయన కంట శేఖర్ పడ్డాడు. "ఏమోయ్ శేఖర్! నువ్వూ వచ్చావే! ఐ యామ్ సారీ ఫరిట్" అన్నాడు అతని అవిటి చేతి కేసి చూసి. "అదే— నీ చెయ్యి పోయిందని తెలిసి చాలా విచారించాను" అన్నాడు ఆయన. ముఖాన నవ్వు లేకపోయినా నవ్వినట్టు మొహం పెట్టాడు శేఖర్. "ప్రముఖ చిత్రకారుడు రాయ్ మాట్లాడారంటే కాస్త మంచి చిత్రకారుడే అవ్వాలి. లేకపోతే ఆయన ముఖంకూడా చూడడు..." ఓ గుడ్డి అభిప్రాయం ఏర్పడిపోయిన ఆ మందంతా వెంటనే శేఖర్ చుట్టూ మూగారు. అలా మూగిన ఆ దురభిమానులనే కాకులు ఓమ వెర్రి మొర్రి ప్రశ్నలు, సానుభూతి వచనాలు, పరామర్శలనే ఇనప ముక్కులతో శేఖర్ హృదయాన్ని తూట్లు తూట్లుగా పొడిచి పొడిచి అతన్ని బాధించారు. ఒకావిడ అందర్నీ తోసుకుని మరీ శేఖర్ ముందుకి వచ్చి, "ప్చ్! మీ చెయ్యి పోయిందని తెలిసింది...ప్చ్! మీ రెలా భరించారో? ప్చ్! ప్చ్! ప్చ్! ఆ రోజు ఎంత బాధ పడ్డారో ఆ ఏడుకొండల వాడికే తెలుసు. ప్చ్! నాకే అంత బాధ కలిగిందంటే, మీ రెలా భరించారో? ప్చ్!" అంటూ అలా మాటకో 'ప్చ్' చొప్పున ఓ పాతిక "ప్చ్! ప్చ్!" లు

కొట్టి కదిలేసరికి— "అయ్యయ్యో! మీ చెయ్యి ప్రమాదంలో పోయిందని తెలిశాక మూడు రాత్రుళ్ళూ, మూడు పగళ్ళూ నిద్రాహారాలు లేకుండా ఏడ్చానంటే నమ్మండి" అంటూ అతిశయోక్తి అమృతం కాసేపు, మరో శాస్త్రి "అంత గొప్ప చిత్రకారుడే. ఆయన చెయ్యి పోగొట్టావేమిటి, భగవంతుడా! నా చెయ్యేనా పోయింది కాదు అని నేను తెగ ఏడుస్తూంటే, బాధ పడిపోతూంటే నా ఆయన చూడలేక, 'అది ఆయన పూర్వజన్మకృత పాపం, కర్మఫలం' అంటూ ఆయన ఎన్నో కబుర్లు చెప్పి తెగ ఓదార్చే సరికి నా మనస్సు కొంత శాంతించింది" అంటూ ఇంకో మహిళామండలి సెక్రటరీ ...ఇలా ఆడవాళ్ళే తమ సానుభూతి శేఖర్ మీద కురిపించేస్తూంటే, మేము మాత్రము తక్కువ తిన్నామా? అన్నట్లు కొందరు పిల్ల చిత్రకారులు రంగప్రవేశం చేసి, "మేము చాలా బాధ పడిపోయాం, చంద్రశేఖరంగారూ!" "ఐ యామ్ వెరీ సారీ! శేఖర్‌గారూ!" "ఇలా జరక్కుండా ఉండల్సింది" అంటూ తమ సానుభూతిని ఒలకపోసేస్తూంటే నిప్పుల మీద నిలబడ్డట్లు బాధ పడసాగాడు శేఖర్. ఇంతలో జలగల్లా పత్రికా విలేఖరులు వ్యూహాన్ని ఛేదించుకుంటూ శేఖర్ దంపతుల ముందు నిలబడి, అక్షయమైన అంబులపొదిలోని వాడి బాణాల్లా ప్రశ్నలను కురిపించసాగారు. "ఏడాది నుండీ నీతి ముఖం చూడకుండా అజ్ఞాత వాసం ఎందుకు చేశారో చెప్పగలరా? ఈ సంవత్సరంలో మీరు చేసిన దేమిటి? మీరు అవిటివా రయిపోయారనీ, ఇక జీవితంలో చిత్రాలు వెయ్యలేరనీ తెలిసి నప్పుడు మీ రెలా ఫీలయ్యారు? మీ ఆవిడకు ఫస్ట్ ప్రైజ్ వచ్చినప్పుడు మీ మనోభావాలు ఎలా ఉన్నాయి?"— ఇలాంటి ప్రశ్నలతో హింసించడం ప్రారంభించారు. తప్పటడుగులు వేస్తూ, కాలు జారి కింద పడ్డ పసిపిల్లవాడిని చూసి, "అయ్యో! పడిపోయావా, అమ్మా? మా బాబే! ఓరి నాయనా! ఎంత దెబ్బ తగిలిపోయిందిరి?" అంటూ బోడి సాను భూతిని చూపించేసరికి, వీళ్ళ సానుభూతి వల్ల తగలకపోయినా, తన కేదో పెద్ద దెబ్బ తగిలిపోయినట్లు ఏడుపు లంకించు కుంటాడు ఆ పసిపిల్లాడు. అదే పెద్దలు చూసీ చూడనట్లూరుకుంటే వాళ్ళంతట వాళ్ళే లేచి మళ్ళీ ఆటల్లో పడిపోతారు. అందరూ సానుభూతి చూపిస్తూంటే తన కేదో పెద్ద లోటు జరిగిపోయినట్లు భావించే పసిపిల్లవాడి మనస్తత్వంలా మారిపోయింది శేఖర్ హృదయం. ఇంతలో ఆ గుంపులో ఒకరు "ఇతనేం ఉద్యోగం చేస్తాడు?" అన్నాడు ఆసక్తిగా. "బాగా డబ్బుంది. ఉద్యోగం చెయ్యవలసిన అవసర



